క్లుప్తంగా

ప్రారంభానికి సిద్ధంగా పీర్ల చావడి



అచ్చంపేట: మండలంలోని మాదిపాడులో నూతనంగా రూ.10లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించిన పీర్లచావడి భవనాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం ప్రారంభించనున్నారు. ఎన్నో ఏళ్లుగా గ్రామంలో పీర్లచావడి కావాలని మొరపెట్టుకుంటున్న ముస్లింల కల ఇన్నాళ్లకు సాకారమైంది. పవిత్ర మొహరం పండుగకు ముందు నెలరోజులపాటు ఉపవాసాలుండి దైవంగా భావించే పీర్లను ఉంచడానికి భవనం లేక ఇప్పటివరకు ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో అది సాధ్యపడిందని ముస్లింలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా గ్రామంలో నూతనంగా కృష్ణానదిలో తిరిగే పడవవద్దకు వెళ్లేందుకు రూ.10లక్షలతో నిర్మించిన రోడ్లను, నూతనంగా నిర్మించిన మరో రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు.

నకరికల్లు ఎస్‌ఐ యడ్లపాడుకు బదిలీ

నకరికల్లు: నకరికల్లు ఎస్‌ఐగా పనిచేస్తున్న పి.సురేష్ బదిలీపై యడ్లపాడుకు వెళ్లారు. 2021 అక్టోబర్‌లో ఫిరంగిపురం నుంచి నకరికల్లుకు వచ్చిన ఎస్‌ఐ పి.సురేష్ సుమారు ఏడాదిన్నర పైగా పనిచేశారు. పనిచేసిన కాలంలో ప్రజల మన్ననలు పొందారు. కాగా ప్రస్తుతం నకరికల్లు స్థానం భర్తీ చేసేందుకు ఎవరు నియమితులవుతారన్నది స్పష్టత రావాల్సింది.

నిద్రమత్తు.. కల్వర్టుని ఢీకొట్టించింది!

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపాన జాతీయ రహదారి మార్గంలో మినీలారీ అదుపు తప్పి వంతెన ఢీకొట్టిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వినుకొండ నుంచి నరసరావుపేట వైపు ఖాళీ లారీ వస్తుండగా మార్గమధ్యంలో లారీ డ్రైవరు నిద్రమత్తులో అతివేగంతో పెదకంచర్ల కాల్వ వంతెన ఢీకొంది. దీంతో ట్రాఫిక్ అంతరాయం వాటిల్లగా సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న మినీలారీను పొక్లయినర్ ద్వారా పక్కకు తొలిగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. డ్రైవరుకు స్వల్ప గాయాలు కాగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి లారీను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయాలు

చిలకలూరిపేట: సామాన్యుల ఇబ్బందులు తెలిసిన ప్రభుత్వం తమదని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్ చెప్పారు. పట్టణంలోని రైతు బజారులో సబ్సిడీపై బియ్యం, కందిపప్పు కౌంటర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం, కందిపప్పు ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో సామాన్యులపై భారం పడకుండా ప్రభుత్వం సబ్సిడీపై బియ్యం, కందిపప్పు అందజేస్తున్నదని చెప్పారు. మేలు రకం సన్నబియ్యం కేజీ రూ. 46, మరో రకం కేజీ రూ.49 చొప్పున విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు. రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా ఒక్కొక్కరికీ ఐదు కేజీల నుంచి 25 కేజీల వరకు బియ్యం విక్రయిస్తామన్నారు. అదే కందిపప్పును కేజీ రూ.135 చొప్పున రెండు కేజీల వరకు విక్రయిస్తారని తెలిపారు. ఇప్పటికే కేజీ టమాటా రూ. 50లకే సబ్సిడీ ధరపై విక్రయిస్తున్న విషయం తెలిసిందేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కొమరవల్లిపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొండవీటి ఆంజనేయులు, మాజీ అధ్యక్షుడు తోట బ్రహ్మస్వాములు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, మున్సిపల్ కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, శ్రీలక్ష్మి, మీరాబి, కోట్యానాయక్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, తహసీల్దార్ జి.సుజాత, సీఎస్‌డీటీ కొండారెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణపై చర్యలు తీసుకుంటాం

శావల్యాపురం: మండల కేంద్రంలో రైల్వే స్టేషను రహదారి మార్గంలో మరలా జరుగుతున్న రోడ్డు ఆక్రమణలపై రెవెన్యూ, పంచాయతీ అధికారుల సారథ్యంలో చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ ఏఈ కంచేటి నవ్య అన్నారు. మంగళవారం రైల్వే స్టేషను పరిధిలో రహదారి మర్గాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ గతంలో మార్కింగ్ చేసిన ప్రకారం సైడు కాల్వ దాటి వ్యాపార సంస్థలు దుకాణాదారులు ముందుకు రాకూడదన్నారు. అవిధంగా వచ్చిన వారిపై రెండు వ్యవధిలోపు సమయం ఇచ్చామని లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పంచాయతీ వారి సారథ్యంలో రహదారి మార్గంలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను విద్యుత్ అధికారుల ద్వారా స్తంభాలను తొలగిస్తామన్నారు.

అటవీ సంపద పరిరక్షించాలి

బొల్లాపల్లి: అటవీ సంపదను పరిరక్షించాలని రాష్ట్ర విజిలెన్స్–2 జిల్లా అటవీ శాఖాధికారి ఎం.రవిశంకర్ శర్మ అన్నారు. మండలంలోని బొల్లాపల్లి సెక్షన్ పరిధిలోని రావులాపురం, రేమిడిచర్ల, దొమలగుండం బీట్ పరిధిలో అడవుల్లో చేసిన పనులను ఆయన మంగళవారం తనిఖీ నిర్వహించారు. 2022–23 సంవత్సరంలో మార్చి వరకు సుమారు రూ.3 లక్షలతో ఆయా బీట్‌లలో నీటికుంటలు, సాసర్ పిట్స్, మొక్కలు పెంపకం, వంటి పనులు చేశారు.

‘గడప గడప’కు సంక్షేమం

- 46 రోజులలో 22,255 గడపల సందర్శన
- 2646 మంది పేదలకు ఇళ్లస్థలాలు
- రూ.2వేల కోట్లకు పైగా సంక్షేమసాయం
- రూ.350కోట్లకు పైగా అభివృద్ధి పనులు
- అమరావతి మండలంలో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధుడితో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు (ఫైల్)

అమరావతి: అమ్మా.. మీఊళ్లో బడులు బాగు చేశారా, పిల్లలను బడికి పంపుతున్నారా.. అమ్మ ఒడి ఇస్తున్నారా.. ఏం అవ్వా పింఛన్ సక్రమంగా వస్తుందా.. తమ్ముడు ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చిందా.. అక్కా ఇంటి స్థలం ఇచ్చారా.. ఇంటి పనులు మొదలు పెట్టారా.. అంటూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటూ సాగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమరావతి మండలంలో ముగిసింది. మండల పరిధిలోని మొత్తం 20 గ్రామాలు, మూడు శివారు గ్రామాలలో 46రోజులపాటు పండుగలా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సాగింది. ఈ ఏడాది మే 11వ తేదీన వైకుంఠపురం వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యే శంకరరావు ప్రారంభించటం జరిగింది. గ్రామ స్థాయిలలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించారు. రేషన్‌కార్డులు, పింఛన్‌లు, ఇతర ప్రభుత్వ పథకాలను కుల, మత, పార్టీల కతీతంగా పేదరికమే ప్రామాణికంగా పేదలందరికీ వర్తింపచేశారు.

96శాతం మందితో నేరుగా మాట్లాడి..

మండలంలోని 16 సచివాలయాల పరిధిలోని 20 గ్రామాలు, మూడు శివారు గ్రామాలలలో 46రోజులపాటు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు 22,255 గడపలను సందర్శించి 64,892మందిని నేరుగా కలుసుకుని ప్రభుత్వ అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరించారు. మండల జనాభాలో 96శాతం మందిని కలిసి వారికి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధికి సంబంధించిన పత్రాలను అందజేశారు.

2646 మందికి ఇళ్ల స్థలాలు ..

మండల పరిధి గ్రామాలలో ఇళ్లు లేని నిరుపేదలకు నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో సుమారు 66.5ఎకరాల భూమిని సుమారు రూ.26కోట్లకు కొనుగోలు చేసి అందులో లేఅవుట్‌లను అభివృద్ధి చేసి 2646మందికి సెంటున్నర చొప్పున ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయటం జరిగింది. దేవిధంగా మండల పరిధిలోని ఇరవై గ్రామాలలో ఉన్న 64,000మంది లబ్ధిదారులకు ఏడాది మార్చి వరకు రూ.2వేల కోట్లు నేరుగా వారి ఖాతాలకు జమ చేయటం జరిగింది.

రూ.350కోట్లకు పైగా అభివృద్ధి పనులు

మండలంలోని పలు గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, షాదీఖానాలు, సిమెంట్, గ్రావెల్ రోడ్లతో పాటుగా ప్రతి సచివాలయం పరిధిలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ల నిర్మాణం, నాడు – నేడు కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధికి సుమారు రూ.350కోట్లు ఖర్చుచేశారు.

రూ.148.95 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం..

మూడు మండలాలను కలుపుతూ ఐదు మండలాల ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం రూ.148.95 కోట్లతో నిర్మిస్తున్న అమరావతి నుంచి బెల్లంకొండ అడ్డరోడ్డు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి సర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. అలాగే పెదమద్దూరు వద్ద వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంతో పాటుగా తుళ్లూరు వరకు రూ.44కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

గడపగడప నిధులతో...

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల అత్యవసర సమస్యలు వెంటనే తీర్చటానికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో మండలంలోని మునగోడు, జూపూడి, దిడుగు, ధరణికోట, నరుకుళ్ళపాడు, ఎండ్రాయి, వైకుంఠపురం గ్రామాలలో రూ.1.14కోట్లతో సిమెంట్‌రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు

ప్రజలను నేరుగా కలుసుకోవడం ఆనందంగా ఉంది



సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రవేశ పెట్టి అమలు చేసిన అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలతో లబ్ధిపొందిన ప్రజలను గడపగడపకు వెళ్లి కలుసుకోవటం ఎంతో ఆనందంగా ఉంది. ప్రజల చెంతకు వెళ్లినప్పుడు వారు చూపిన అభిమానం నాపూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ధైర్యంగా ప్రజల ముందుకు వెళ్లి మా ప్రభుత్వం మీ కుటుంబానికి ఇంత లబ్ధిచేకూర్చిందని ప్రతిపక్షపార్టీవారికి కూడా చెప్పగలుగుతున్నామంటే అది జగనన్న ఇచ్చిన భరోసా మాత్రమే. జగనన్న సహకారంతోనే మండలంలో రూ.2వేలకోట్లకు పైగా సంక్షేమసాయం, మరో రూ.350కోట్లతో అభివృద్ధి పనులు చేయగలిగాం.

– నంబూరు శంకరరావు,
పెదకూరపాడు శాసనసభ్యుడు

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నూర్‌బాషా సంఘం నాయకులు

నకరికల్లు: నూర్‌బాషాలకు వైఎస్సార్ షాదీతోఫా పథకం ద్వారా రూ.లక్ష ఇస్తున్న మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నూర్‌బాషా దూదేకుల ముస్లింసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాజీ అన్నారు. స్థానిక వై.జంక్షన్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తారని అన్నారు. గతంలో వివాహాలకు రూ.50వేలు మాత్రమే ఇచ్చేవారని పేద ఆడబిడ్డల కోసం ప్రస్తుతం వాటిని రూ.లక్షకు పెంచిన జగనన్న పేదల పక్షపాతిగా నిలిచారన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ మీరావలి, గుంటూరు జిల్లా వక్ఫ్‌బోర్డు కమిటీ వైస్ చైర్మన్ స్టార్ మస్తాన్, వైస్ ఎంపీపీ దూదేకుల హుస్సేన్‌బీ బాషా, ఎఫ్‌బీఓ మీరావలి, ఎఫ్‌ఆర్‌ఓ గాలిబ్, నుదురుపాడు మస్తాన్‌వలి, రాష్ట్ర యువత అధ్యక్షుడు మట్టిపాటి బాష, పల్నాడు జిల్లా కన్వీనర్ హసాన్‌వలి, పెదకూరపాడు నియోజకవర్గ నాయకులు హుస్సేన్, హుస్సేన్‌మీరా, పాట్టిపాడు మస్తాన్‌వలి పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



పెదకూరపాడు: మండలంలోని 75త్యాళ్లూరు ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాల విద్యార్థులకు సేవా(సొసైటీ ఫర్ ఎక్సలెన్స్ విజన్ అండ్ యాక్షన్) సంస్థ తరపున వర్క్ ఇంటెల్ ప్రైవేట్ లిమిటెడ్ సహాయంతో పాఠ్యపుస్తకాలు బుధవారం పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి నరేంద్రబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి సాయం అందించాలనే లక్ష్యంతోనే సేవా సంస్థ పని చేస్తుందన్నారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, నిర్వహకులు భాస్కర్, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరరావు



పెదకూరపాడులో అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు



సత్తెనపల్లి 9వ వార్డు సచివాలయం వద్ద జరిగిన క్యాంపులో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెదకూరపాడు: పేదల గడపలోకి ప్రభుత్వాన్ని తెచ్చి, వారి కష్టాలు తీరుస్తున్న గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. పెదకూరపాడు–1,2 సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జగనన్న సురక్ష స్పెషల్ క్యాంప్‌లో లబ్ధిదారుల నుంచి వచ్చిన 1127 అర్జీలను నిర్ణీత సమయంలో ధ్రువీకరణ పత్రాలు అందించాలని అధికారులను ఎమ్మెల్యే శంకరరావు కోరారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున రాష్ట్రం మనదన్నారు. ప్రజలకు మంచి చేసే జగనన్నకు అందరూ అండగా నిలిచి సహకరించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలనూ నెరవేర్చాన్నారు. క్రోసూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైస్ ఎంపీపీ షేక్ బాష, సచివాలయ కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, ఎంపీడీఓ నరసింహరావు, తహసీల్దార్ క్షమారాణి, అధికారులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): ప్రజల సమస్యలు తెలుసుకొని ప్రభుత్వ అధికారులు ఇళ్ల వద్దకే వచ్చి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందించటమే జగనన్న సురక్ష కార్యక్రమం అని సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ చెప్పారు. పట్టణంలోని 9వ వార్డు సచివాలయం పాత సాలిపేట పరిధిలోని కమ్యూనిటీ సెంటర్ జగనన్న సురక్ష క్యాంపు మంగళవారం నిర్వహించారు. క్యాంపులో 1235 గృహాలకు గానూ 1006 గృహాలలో సర్వే నిర్వహించి, 398 టోకెన్‌లకు గానూ 194 సర్టిఫికెట్లు అందజేశారు. కౌన్సిలర్లు అచ్యుత శివప్రసాద్, ఆకుల రమేష్, నాయకులు పాల్గొన్నారు.

తాళ్లచెరువులో...

అచ్చంపేట: అర్హతుంటే చాలు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మీ ఇంటికి వచ్చి పూర్తి వివరాలు సేకరించి, కావలసిన ధ్రువీకరణ పత్రాలను ఇప్పించి మీకు కావలసిన సంక్షేమ పథకాన్ని అందచేస్తారని ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాళ్లచెరువులో మంగళవారం నిర్వహించిన శిబిరంలో ఆయన మాట్లాడారు. 120మందికి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. సర్పంచ్ కిక్కురు అన్నమ్మ, ఎంపీటీసీ గోపు అంతోనిరెడ్డి, బాలశౌరెడ్డి, పాల్గొన్నారు. మండలంలోని వేల్పూరులో తహసీల్దారు సీహెచ్ పద్మాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 91మందికి టోకెన్లు ఇవ్వగా 68 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, సొసైటీ మాజీ ఛైర్మన్ నల్లపాటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ధరణికోటలో...

అమరావతి: అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమఫలాలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష పథకం అమలు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంపీపీల సంఘం కన్వీనర్, అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ధరణికోట సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్షాపథకం గ్రామసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీఓ మాధురి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో 510 ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు ఆలపాటి వీరయ్య, గ్రామ సర్పంచ్ మాదాసు పావని, ఎంపీటీసీ కంభంపాటి విజయకుమారి, తహసీల్దార్ విజయశ్రీ వైఎస్సార్ సీపీ నాయకులు భవిరిశెట్టి హనుమంతరావు, కొండవీటి నారాయణ, మాదాసు రాంబాబు పాల్గొన్నారు.

దొడ్లేరులో....

క్రోసూరు: పేద ప్రజలకు, రైతులకు, విద్యార్థులు కావాల్సిన అన్ని రకాల సర్టిఫికెట్లు ఇళ్ల వద్ద అందించేందుకే జగనన్న సురక్ష శిబిరాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని వైఎస్సార్ సీపీ దొడ్లేరు గ్రామ అధ్యక్షుడు పల్లప్రోలు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని దొడ్లేరు–1.2 సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహించారు. శిబిరాలకు దొడ్లేరు–1 ఎంపీడీఓ బి.మహేష్, దొడ్లేరు–2 తహసీల్దార్ ఎండి జియావుల్‌హక్ అధికారులు పర్యవేక్షించారు. రెండు శిబిరాల్లో 170 అర్జీలు రాగా వాటిలో అక్కడిక్కడే 80 సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. గ్రామసర్పంచ్ ముక్కు అంజలి, ఏఓ వేణుగోపాల్, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, ఎంపీపీ పి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో...

రాజుపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరిస్తున్నామని ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని దేవరంపాడు, నెమలిపురి, ఉప్పలపాడులలో జగనన్న సురక్ష కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. 463 మంది మూడు గ్రామాల నుంచి సమస్యలు గురించి దరఖాస్తు చేసుకోగా పూర్తిగా పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరంపాడు దేవస్థానం కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, సర్పంచ్‌లు పత్తిపాటి దీనమ్మకోటేశ్వరరావు, కొర్రకూటి వెంకాయమ్మ, రామావత్తు మేరీభాయి, తహసీల్దారు నళిని, ఎంఈవో మల్లిఖార్జునశర్మ పాల్గొన్నారు.

పాపాయపాలెంలో...

బెల్లంకొండ: అర్హులు అందరికీ పథకాలు అందజేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీఓ వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పాపాయపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. గ్రామంలోని ప్రధానసెంటర్‌లో నిర్వహించిన ఈ సదస్సులో లబ్ధిదారులకు కావలసిన సర్టిఫికేట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. గ్రామ సర్పంచ్ చిమటా మాధవి వెంకట సైదయ్య, ఎంపీటీసీ మర్రి శ్రీనివాసరెడ్డి, గ్రామ నాయకులు మర్రి ప్రసాదరెడ్డి, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో కేసులు నమోదు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ రోడ్డులో ఆదివారం జరిగిన ఘర్షణలో ఇరు పార్టీలకు చెందిన వారిపై కేసులు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ బాల నాగిరెడ్డి తెలిపారు. అమరావతి హోమ్స్‌లో టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన పట్టణానికి చెందిన యర్రం రెడ్డి సీతమ్మ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుపై పోలీసులు విచారణ జరిపి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవింద బాబు, పార్టీ నాయకులు కడియాల రమేష్, చల్లా సుబ్బారావుతో పాటు మరికొంత మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. బాధిత మహిళ యర్రంరెడ్డి సీతమ్మపై చదలవాడ అరవింద్ బాబుతోపాటు ఇతర టీడీపీ నేతలు పెద్ద పెద్ద కర్రలతో దాడి చేసిన దృశ్యాలు లభ్యమవడంతో కేసులు నమోదు చేశారు. దీంతో పాటు మరో రెండు కేసులు టీడీపీ నాయకులపై నమోదయ్యాయి. అలాగే టీడీపీ కార్యకర్త మాతంగి గోవిందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిలారు గోపితో పాటు మరికొంత మందిపై దాడి కేసు నమోదైంది.

మేలు జరిగిందని భావిస్తే ఆశీర్వదించండి



జగనన్న సురక్ష క్యాంపులో అర్హులకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

- రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు
- ఫణిదంలో జగనన్న సురక్ష క్యాంపు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): ఈ నాలుగేళ్ల పాలనలో మీ కుటుంబానికి మేలు జరిగిందని భావిస్తేనే ఆశీర్వదించాలని రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలంలోని ఫణిదం గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష క్యాంపులో ముఖ్య అతిథిగా హాజరై అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. గత ప్రభుత్వం దుర్మార్గంగా పరిపాలించబట్టే సాగనంపారని, ఈ ప్రభుత్వం పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉందని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలు రెండు సమన్వయంతో సక్రమంగా పనిచేస్తున్నాయి కాబట్టే సుపరిపాలన అందుతుందన్నారు. ఇలాంటి ఆదర్శవంతమైన వ్యవస్థలపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ దారుణంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రతి వ్యవస్థలోను చిన్న చిన్న పొరపాట్లు ఉంటాయని, వాటిని బూచిగా చూపి వ్యవస్థ మొత్తంపై బురద చల్లటం హేయమన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ యంత్రాంగం అంతా మీ ఇంటికి వచ్చి, మీ తలుపు తట్టి, మీ సమస్యలను అడిగి, పరిష్కారం చూపి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఇంటి వద్ద అందించే బృహత్తర కార్యక్రమమే జగనన్న సురక్ష అన్నారు. గ్రామంలోని రెండు సచివాలయల పరిధిలో 1858 కుటుంబాలు ఉండగా, 1596 కుటుంబాలను సర్వే చేసి 500 అర్జీలు స్వీకరించారన్నారు. వీటిలో 507 అర్జీలను పరిష్కరించి నూరు శాతం ఫలితాలతో ఉత్తమంగా ఫణిదం సచివాలయసిబ్బంది సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేమవరపు బుల్లిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెంబాబురావు, వైఎస్సార్ సీపీ నాయకుడు పక్కాల సూరిబాబు, ఎంపీటీసీలు ఇన్నమ్మ, రాహేలమ్మ, రూరల్ మండల కన్వీనర్ రాయపాటి పురుషోత్తంరావు, తహసీల్దార్ సురేష్‌నాయక్, ఎంపీడీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

పేదల కోసమే జగనన్న సురక్ష..

మాదల(ముప్పాళ్ళ): పేదలందరికీ ప్రభుత్వ పథకాల సంక్షేమ లబ్ధి అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని మాదల గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష క్యాంపునకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ యంత్రాంగం నేరుగా మీ ఇంటికి వచ్చి, మీ సమస్యలను అడిగి తెలుసుకొని వారి పరిష్కారానికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు ధ్రువీకరణపత్రాల కోసం రోజుల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి నేరుగా మీ చెంతకే ప్రభుత్వ ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న సరికొత్త ఆలోచన అన్నారు. రెండు సచివాలయాల పరిధిలో 2,784 నివాసాలు ఉండగా 2,296 గృహాలను వలంటీర్ల బృందం సందర్శించగా 1095 అర్జీలు రాగా అందులో 682 ధ్రువీకరణ పత్రాలు అందించారు. ముందుగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీకార్యకర్తలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. కౌలు రైతులకు కౌలు కార్డులు అందించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా కందివిత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచ్ సింగంశెట్టి కోటేశ్వరమ్మ, ఎంపీపీ మారూరి పద్మ, మార్కెట్ యార్డు చైర్మన్ పెండెం బాబురావు, ఉపసర్పంచ్ సైదా, ఎంపీటీసీ గోగుల అంజిబాబు, తహసీల్దార్ ఎం.భవానీశంకర్, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పక్కాల సూరిబాబు, ఎంజీఎం రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, నక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమమే లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శంకరరావు

అమరావతి: ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అత్తలూరులో రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా సంక్షేమ సాయం అందిస్తున్నామన్నారు. మంగళవారం ఎస్టీ కాలనీలో ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. నాలుగేళ్లలో అత్తలూరులో సంక్షేమ పథకాల రూపంలో రూ.15.24 కోట్లు అందించామన్నారు. గ్రామంలో రూ.18.74 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ఇందులో కనీసం పది శాతమైనా అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాలతో గ్రామంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందించామన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, తనను మరొక్కసారి ఆశీర్వదించాలన్నారు. వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య, జీడీసీసీ బ్యాంక్ డైరక్టర్ కోట హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, గ్రామసర్పంచి బంకా సరోజిని, వైఎస్సార్ సీపీ నాయకులు మాదినేని హరిబాబు, మదమంచి సతీష్, సింగమనేని నరసయ్య, భవిరిశెట్టి హనుమంతరావు, అలా లక్ష్మీనారాయణ, నండూరి కరుణకుమార్, వెంపా వాసు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక..

క్రోసూరు: మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త జిడుగు నారయ్య మంగళవారం ఎమ్మెల్యేనంబూరుశంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాడు. గుంటూరు లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి నారయ్యను స్వాగతించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి మొహర్రం మాసం ప్రారంభం



దొడ్లేరులో పీర్లచావిడిలో ఏర్పాటు చేసిన పీర్లు(ఫైల్)

క్రోసూరు: ముస్లింలకు రంజాన్ మాసం తరువాత ముఖ్యమైన మొహర్రం మాసం బుధవారం నుంచి ప్రారంభమవుతుందని ఇస్లాం పెద్దలు తెలియచేశారు. ఇస్లాం ప్రకారం మొహర్రంతో ఇస్లామిక్ నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. మొహర్రం మాసంలో ప్రవక్త మహమ్మద్ మనవడు ఇమాం హుస్సేన్ కర్బలా మైదానంలో జరిగిన యుద్ధంలో అమరుడైన సందర్భంగా ముస్లింలు ఉపవాసదీక్షలు చేపడతారు. అదేవిధంగా పీర్ల పండుగ నిర్వహిస్తారు. మండలంలోని దొడ్లేరు గ్రామంలో పీర్ల పండుగ ఘనంగా నిర్వహిస్తారు. పదిరోజుల పాటు పీర్లకు ప్రార్థనలు చేపట్టి అగ్నిగుండాల మీదగా నడిచి సంతాపదినాలు నిర్వహించటం ఆనవాయితీ.

కల్యాణం.. కమనీయం...



గణపవరంలో రాముల వారి కల్యాణం నిర్వహిస్తున్న శ్రీనివాస దీక్షితులు

నాదెండ్ల: గణపవరంలోని శ్రీ కోదండరామస్వామి కల్యాణ మహోత్సవం, పట్టాభిషేకం కన్నుల పండువగా జరిగింది. రూ.2.5 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన రామాలయాన్ని జూన్ 7న త్రిదండి చినజీయర్ స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠ జరిగిన విషయం విదితమే. ఆలయ ప్రతిష్ఠ జరిగి 41 రోజులైన సందర్భంగా సోమవారం మండల దీక్షా మహోత్సవం నిర్వహించారు. టీటీడీ వేదపాఠశాల అధ్యాపకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం శాంతిహోమం, అర్చనలు, అభిషేకాలు జరిగాయి. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ 140 జంటల చేతుల మీదుగా కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం రాముల వారి పట్టాభిషేకం జరిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.